

వలిగొండ : కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

# నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

**• భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి**

వలిగొండ, ఫిబ్రవరి 21: నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి పథకం అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 46 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాల్వలను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సహచర ఎమ్మెల్యేలతో కలిసి సాగునీటి కాల్వలకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశామని, నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని తెలిపారు. భువనగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని వెంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 60వ వార్షికోత్సవ వాల్‌పోస్టర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్, జడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాత రాజు ఉమాబాలనర్సింహ, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : కల్యాణలక్ష్మి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలో 37మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు బత్తుల మాధవీశ్రీశైలంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

భువనగిరి కలెక్టరేట్ : ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగే రాయగిరి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఆధ్వర్యంలో బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాల్త్య హనుమంతునాయక్, మాజీ ఉప సర్పంచ్ మేకల బాలనర్సింహయాదవ్, మాజీ వార్డు సభ్యులు బొజ్జ ఎల్లేశ్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గుట్టలో సుదర్శన నారసింహ హోమం



స్వామివారికి జోడు సేవ నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు వైభవంగా నిర్వహించారు. సుమారు 7 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ. 15,04,251 ఆదాయం సమకూరిందని ఈఓ రామకృష్ణారావు తెలిపారు.



బొమ్మలరామారం : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

# చదువులో అంతరాలు తొలిగిపోవాలి

**• ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**

భువనగిరి కలెక్టరేట్/యాదగిరిగుట్ట/బొమ్మలరామారం/తుర్కపల్లి : ప్రభుత్వ బడులు నిలబడాలన్నా, చదువులో అంతరాలు పోవాలన్నా ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలాల సందర్శనలో భాగంగా బుధవారం భువనగిరి, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం, తుర్కపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి వార్డు మెంబర్ నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి చీఫ్ సెక్రటరీ వరకు అధికారులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ, మండల పరిషత్, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 75 నుంచి 100 మంది విద్యార్థులుండేలా రీఆర్గనైజ్ చేసి తరగతికి ఒక గది, తరగతికి ఒక టీచర్, ప్రధానోపాధ్యాయుడు, సర్వీస్ పర్సన్ ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాల పర్యవేక్షణ కోసం మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారుల పోస్టులు మంజూరు చేసి వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్ట్స్, వర్క్ ఎడ్యుకేషన్, కేజీబీవీ, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారందరికీ కనీస వేతనం అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన బిల్లులు, వంట ఏజెన్సీల పారితోషికాలను ప్రతి నెల 5లోగా ఖాతాల్లో జమ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిలిచిపోయిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులతోపాటు మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు సంగు వనిత, జిల్లా కార్యదర్శి రాజగోపాల్, ఆయా మండల శాఖల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట : విజయ సంకల్ప యాత్రలో నమస్కరిస్తున్న ఈటల రాజేందర్

# రూ.2 లక్షల రుణమాఫీ అసాధ్యం

**• బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్**

ఆత్మకూరు(ఎం)/యాదగిరిగుట/మోటకొండూరు/మోత్కూర్, ఫిబ్రవరి 21: అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం ఆత్మకూర్(ఎం), యాదగిరిగుట్ట, మోటకొండూరు, మోత్కూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ రక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం అవసరమని ప్రజలు గుర్తిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా మరో 20 ఏండ్ల వరకు కేంద్రంలో అధికారంలోకి రాదన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కల్లబొల్లి మాటలు చెబుతూ పబ్బం గడుపుతుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే కాంగ్రెస్ నాయకులను, మంత్రులను గ్రామాల్లోకి రానివ్వకుండా తరిమికొట్టాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ అసాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఓడిపోయిన ఎమ్మెల్యేలతో అభివృద్ధి పనులు చేయిస్తూ అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి హామీలు అరచేతిలో వైకుంఠం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల వాగ్దానాలను విస్మరించిన కాంగ్రెస్‌కు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు, కౌలు రైతుకు రూ.12 వేలు, మహిళలకు నెలకు రూ.2500, రూ.500 వంట గ్యాస్ వంటి హామీలన్నీ బుట్టదాఖలయ్యాయని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, దాసరి మల్లేశం, పడాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

### లక్ష్మణ్ బాపూజీ చిత్రానికి అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ అవార్డు

చౌటుప్పల్, ఫిబ్రవరి 21 : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా ఇటీవల రూపొందించిన 'యూనిటీ ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' అనే ఎక్స్‌పరిమెంటల్ చిత్రం అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్–2024 అవార్డుకు ఎంపికైనట్లు చిత్ర నిర్మాత, చౌటుప్పల్‌కు చెందిన చిరందాసు ధనుంజయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో ప్రపంచ వ్యాప్తంగా 750 సినిమాలు పోటీలో నిలువగా, దేశంలో 361 చిత్రాలు వచ్చాయని, వీటిలో 25 చిత్రాలు అవార్డుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. మార్చి 11 నుంచి 14 వరకు ముంబైలోని కంబల్ల హాల్‌లో ఎంపికైన చిత్రాల ప్రదర్శన, అవార్డుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

### ఆలయ కమిటీల చైర్మన్ల నియామకం

చౌటుప్పల్, ఫిబ్రవరి21 : పట్టణ కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ చైర్మన్‌గా బొబ్బిళ్ల మురళి, సభ్యులుగా కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, గుర్రం వెంకటేశం, పోలోజు శ్రీలత, తూర్పాటి నర్సింహను నియమించారు. అలాగే లింగోజిగూడెం శివ మహాదేవ ఆలయ కమిటీ చైర్మన్‌గా బండమీది ఎల్లయ్య, సభ్యులుగా బాతరాజు యాదయ్య, మందోరి నరేశ్, బోసి అన్నపూర్ణ, బాతరాజు స్వామిని నియమించి నియామక పత్రాలను మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మీరాజగోపాల్‌రెడ్డి, ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహగౌడ్, పబ్బు రాజుగౌడ్, ఉబ్బు వెంకటయ్య, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, మొగుదాల రమేశ్‌గౌడ్, అంతటి బాలరాజుగౌడ్ పాల్గొన్నారు.

### గోకారంలో చోరీ

**• 4తులాల బంగారం అపహరణ**

వలిగొండ, ఫిబ్రవరి 21 : మండలంలోని గోకారంలో బుధవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకారం గ్రామానికి చెందిన ఏర్వ రామచంద్రయ్య భార్య సుశీలతో కలిసి ఈ నెల 17న మేడారం జాతరకు వెళ్లి బుధవారం సాయంత్రం ఇంటికి తిరిగివచ్చారు. ఇంటి తలుపులు తెరచి ఉండడంతో ఆశ్చర్యపోయి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాను పరిశీలించగా 4 తులాల బంగారు నగలు, 17 తులాల వెండి గొలుసులు కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన అక్కడికి వచ్చి డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో తనిఖీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

### నేడు సేవాలాల్ జయంతి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : పట్టణంలోని రావి భద్రారెడ్డి గార్డెన్స్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నేడు ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ కృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు, గిరిజన నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఆర్థిక సాయం

చౌటుప్పల్, ఫిబ్రవరి 21 : చౌటుప్పల్‌కు చెందిన మహేశ్వరం నరేందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఆయన చిన్ననాటి స్నేహితులు, స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1995–96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రసాదరావు, కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్, బొంగు శ్రీనివాస్‌గౌడ్, సొప్పరి శంకర్, నలపరాజు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వలిగొండ : మండలంలోని అరూరుకు చెందిన మహ్మద్ ఖలీల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం తుమ్మల నర్సయ్య సేవా సమితి సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ నాయకుడు బండారు నర్సింహారెడ్డి, కసరబోయిన లింగయ్య, పిట్టల సుధాకర్, చెమ్మయ్య, చంద్రయ్య, సత్యనారాయణ, కనకాచారి, అంజయ్య, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### కనకదుర్గ ఆలయంలో మహాయజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలో పునర్నిర్మాణం చేపట్టిన కనకదుర్గ ఆలయంలో బుధవారం మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు ఏనుగు సురేందర్‌రెడ్డి, సుగంధిని, ఎంపీటీసీ యాస కవిత, మాజీ సర్పంచ్‌లు నగేశ్, పూర్ణచందర్ రాజు, లక్ష్మారెడ్డి, చందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దశరథగౌడ్, మల్లేశం, నర్సిరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.




స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

### ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 21 : పట్టణంలోని శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఒక్కరోజు అధ్యాపకులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ట్రెడిషనల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, క్యాట్ వాక్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్‌బీ మల్లేశం, శ్రవణ్ కుమార్, శ్రీకాంత్, శంకర్, రమేశ్, పట్టాభి, స్టీఫెన్, ప్రసన్నారెడ్డి, మౌనిక, మధు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలి

**• గ్రామపంచాయతీ అధికారికి బీఆర్‌ఎస్ నాయకుల వినతి**



అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 21 : మండలంలోని తూఫ్రాన్‌పేటలో మురుగు కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మండల నాయుకులు బుధవారం గ్రామ పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఆల్మాసిపేట భిక్షపతి ఇంటి వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై స్థానిక కాంగ్రెస్ నాయకులు చెంచల శ్రీనివాస్, పరమేశ్, శంకర్ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి ఆల్మాసిపేట కృష్ణ, మాజీ సర్పంచ్ చక్రం జంగయ్య, బొజ్జ బాలయ్య, బక్కతట్ల లింగస్వామి ఉన్నారు.

### తెలంగాణ ఉద్యమ నాయకుడు స్వామి మృతి



స్వామి(ఫైల్)

రామన్నపేట, ఫిబ్రవరి 21: మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమనాయకుడు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు గడ్డం స్వామి బుధవారం మృతి చెందారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఇతను ఉద్యమ నేత కేసీఆర్ ఇచ్చిన ప్రతి పిలుపును అందుకొని గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేశారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం, మండల కార్యదర్శి పోశబోయిన మల్లేశం తదితరులు సంతాపం తెలిపారు.

### ఎంపీడీఓకు సన్మానం

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 21 : ఇటీవల బదిలీ అయిన ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావును బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంధమల్ల అశోక్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీఓ సలీం, సూపరింటెండెంట్ వెంకటరమణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

### చౌటుప్పల్ చెరువుకు గోదావరి జలాలు అందించాలి

**-సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్**

చౌటుప్పల్, ఫిబ్రవరి 21 : చౌటుప్పల్ చెరువుకు బస్వాపూర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో నీటి ఎద్దడి నివారణకు ఈ జలాలు ఉపయోగపడుతాయన్నారు. అలాగే తంగెడపల్లి చెరువుకు చర్లగూడెం ప్రాజెక్టు ద్వారా మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ పాషా, బండారు నర్సింహ, నాయకులు ధర్మయ్య, దాసు, ధర్మారెడ్డి, స్వామి, ఈదయ్య, అంజిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### రామన్నపేట ఎస్ఐగా మల్లయ్య



రామన్నపేట, ఫిబ్రవరి 21 : రామన్నపేట ఎస్ఐగా పి.మల్లయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.




సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శోభారాణి

# వలసల నివారణకు ఉపాధి హామీ పనులు

**• జడ్పీ సీఈఓ శోభారాణి**

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు ఉపాధి హామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 14వ విడుత సామాజిక తనిఖీలో ఆమె పాల్గొని మాట్లాడారు. 2022ఏప్రిల్1 నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలో రూ.5,39,54,500 పనులు నిర్వహించగా, అందులో కూలీలకు రూ.4,24,41,014, మెటీరియల్ కాంపోండ్‌కు రూ.1,15,13,057 కేటాయించినట్లు తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలన్నారు. మండలంలో 34గ్రామాలకు సంబంధించి తనిఖీలు నిర్వహించగా పని ఖర్చులో వ్యత్యాసం రావడంతో రూ.2,47,7844 రికవరీకి నోటీసులు జారీ చేసినట్లు అంబుడ్స్‌మెన్ వీరమల్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మలావెంకటస్వామి, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు, ఎంపీఓ అనూరాధ, అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్, ఏపీఓలు శ్యామల, బాలస్వామి, ఏవీఎం ఆదిత్య, ఈసీ రాజశేఖర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**• ఎంపీపీ గంధమల్ల అశోక్**



సర్వసభ్య సమావేశంలో నివేదికను చదివి వినిపిస్తున్న ఏఓ దీప్తి

ఆలేరు రూరల్, ఫిబ్రవరి 21 : అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గంధమల్ల అశోక్ అన్నారు. బుధవారం ఆలేరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యానంద్‌ప్రసాద్, ఎంపీఓ సలీం, వైస్ ఎంపీపీ గాజుల లావణ్యావెంకటేశ్, ఎంపీటీసీలు ఆరె ప్రశాంత్‌గౌడ్, బత్తుల నరేందర్‌రెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### పబ్లిక్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మండల వైద్యాధికారి శ్రీవాణి

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 21 : మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై మండల వైద్యాధికారి శ్రీవాణి బుధవారం అవగాహన కల్పించారు. ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని అన్నారు. పరీక్షల సమయంలో తేలికపాటి ఆహారం తీసుకోవాలని, ఆరు గంటలపాటు నిద్రపోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రంజిత్, ఎంపీహెచ్ఏ లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.

### నేరాలపై యువతకు అవగాహన



యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేశ్

బీబీనగర్, ఫిబ్రవరి 21 : నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని బీబీనగర్ ఎస్ఐ రమేశ్ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌గూడెంలో మంగళవారం గ్రామ యువకులకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు.



రామన్నపేట : హోమంలో పాల్గొన్న భక్తులు

# కనులపండువగా మల్లికార్జునుడి కల్యాణం

రామన్నపేట, ఫిబ్రవరి 21 : మండలంలోని సిరిపురంలో భ్రమరాంబికాసమేత మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం కనులపండువగా నిర్వహించారు. యాజ్ఞికులు నాగార్జున ఆచార్యుల ఆధ్వర్యంలో గణపతిపూజ, మహారుద్రాభిషేకం నిర్వహించారు.

శైవ ఆగమశాస్త్ర ప్రకారం గాయత్రీధారణ, జిలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏళ్ల రాజశేఖర్‌రెడ్డి, బోడె శ్రీనివాస్‌రెడ్డి, పల్లె మల్లికార్జున్‌రెడ్డి, పాండుయాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పైళ్ల నాగమణి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ బడుగు రమేశ్, రాపోలు రమేశ్, దాసిరెడ్డి శ్రవణ్, పున్న వెంకటేశం పాల్గొన్నారు.

### దివ్య స్వర్ణిమ రథం ప్రారంభం

బీబీనగర్ : మహాశివరాత్రిని పురస్కరించుకుని సైలెన్స్ రిట్రీట్ సెంటర్ బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో సోమనాథేశ్వర వజ్రలింగ దర్శన దివ్య స్వర్ణిమ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. దివ్య రథం ద్వారా మండలంలో పర్యటించి పరమాత్ముడి సందేశాన్ని తెలియజేస్తామన్నారు. చంద్రశేఖర్, మధుసూదన్, కార్తీక్, జయశంకర్, సునీత, ఓంకార్, స్వాతి, స్వర్ణలత, గీత పాల్గొన్నారు.

### ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రాజాపేట : మండలంలోని సంకల్పసిద్ధి వెంకటేశ్వరాలయంలో బుధవారం ఏకశిల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా పాఠ్య పుస్తకాల మేనేజర్ రంగరాజన్

# సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

**• జిల్లా పాఠ్య పుస్తకాల మేనేజర్ రంగరాజన్**

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : సైన్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా పాఠ్యపుస్తకాల మేనేజర్ రంగరాజన్ విద్యార్థులకు సూచించారు. జాతీయ హరితదళం(ఎన్‌జీసీ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎన్నోకోబడిన పాఠశాలల విద్యార్థులకు బుధవారం స్థానిక వెన్నెల కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి డ్రామా, ఏకపాత్రాభినం పోటీల్లో భాగంగా గెలుపొందిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి మాట్లాడారు. ఎన్‌జీసీ స్టేట్ ప్రాజెక్ట్ అధికారి రాధిక, జిల్లా సైన్స్ ఆఫీసర్ భరణికుమార్, సెక్టోరల్ అధికారి లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నిర్మలజ్యోతి పాల్గొన్నారు.